విశాలాంధ్ర నంద్యాల

www.visalaandhra.com

కర్నూలు, సోమవారం 05, ఆగష్టు 2024

రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోంది

- టీడీపీ నాయకులు హత్యా రాజకీయాలకు చరమగీతం పాడండి
- మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

విశాలాంధ్ర - నంద్యాల : రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తున్నదని, హత్యా రాజకీయాకు టీడీపీ నాయకులు చరమగీతం పాడాల్సిన అవసరం ఉందని, లేనిపక్షంలో తాము సైతం తిరగబడతామని, తగ్గేదిలేదని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తేల్చిచెప్పారు. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత నంద్యాల జిల్లా మహానంది మండలం సీతా రామపురం గ్రామంలో వైసీపీ నేత పసుపులేటి పెద్ద సుబ్బ రాయుడు అలియాస్ పెద్దన్న అనే వృద్ధున్ని టీడీపీ నేతలు శ్రీని వాసరెడ్డి, అతని అనుచరులు 30 మంది పొల్గొని కర్రలతో, రాళ్లతో అతిదారుణంగా గ్రామంలో హత్య గావించడం జరిగింది. ఈ ఘటనకు సంబంధించి శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే కాటపాని రాంభూపాల్ రెడ్డి, నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి, బనగాన పల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మృతదేహాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. వైసీపీ నాయకులకు, కార్యకర్తలకు తాము ఎల్లవేలలా వెన్నంటి ఉంటామని, భయపడాల్సిన అవసరం లేదని ధైర్యం కల్పించారు. ఇకనైనా రెడ్ బుక్ రాజ్యాంగానికి స్వస్తిపలకాలని, గ్రామాలలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు టీడీపీ ప్రభుత్వం చర్యలు తీసు కోవాలని వారు కోరారు. ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి, ఎమ్మెల్సీ ఇసాక్ బాష, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి, వైసీపీ నాయకులు శిల్పా భువనేశ్వర్రెడ్డి తదితర నాయకులు హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి మాట్లా డుతూ టీడీపీ కూటమి ప్రభుత్వంలో రెడ్ బుక్ రాజ్యాంగం, హత్యా రాజకీయాలు నడుస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసెంబ్లీ సాక్షిగా రాష్ట్రంలో దాడులు, హత్యా ఘటనలు జరగవని చెప్పడం జరిగిందని, అసత్యపు ప్రకటనలు మాత్రమేనని తెలుస్తున్న దన్నారు. ఈ ఘటనలకు కారకులు స్థానిక ఎమ్మెల్యేనా? లేక సీఎం చంద్రబాబా? లేదా నారా లోకేషా చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామంలో మరికొన్ని హత్యలు జరిగే అవకాశం ఉందని, నారపురెడ్డి, పెద్దిరెడ్డి, జమాల్రెడ్డి, ఇతర వైఎస్సార్సీపీ నాయకులకు పోలీసులు రక్షణ కల్పించాలని శిల్పా కోరారు. నంద్యాల జిల్లా వైసీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి, బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిలు మాట్లాడుతూ సీతారామపురం గ్రామంలో జరిగిన దారుణ హత్యను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. టీడీపీ హత్యా సంస్కృతికి, ఫ్యాక్షన్ రాజకీయాలకు చరమగీతం పాడాలని కోరారు. హత్యా రాజకీయాలకు స్వస్తి పలకాలని, హత్యచేసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

శ్రీశైలానికి పోటెత్తిన భక్తులు

ఘాట్ రోడ్‌లో తప్పని ట్రాఫిక్ ఇబ్బందులు

విశాలాంధ్ర - శ్రీశైలం: ప్రముఖ శైవ క్షేత్రంగా శక్తిపీఠంగా విరజిల్లుతున్న శ్రీశైల మహా క్షేత్రంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు శ్రీశైలం చేరుకొని తమ మొక్కలు తీర్చుకొని స్వామి అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. అధిక సంఖ్యలో భక్తులు శ్రీశైలం చేరుకోవటంతో ఆలయ అధి కారులు ఆలయ వేళలో మార్పులు చేయడం జరిగింది. సుమారు 50 వేలకు మంది పైగా భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నా రని అంచనా. శ్రీశైలం డ్యాం పదిగెట్లు ఎత్తటంతో అధిక సంఖ్యలో భక్తులు శ్రీశైలం డ్యామ్ చూసేందుకు, స్వామి అమ్మ వాళ్ళని దర్శించుకునేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, తమిళ నాడు నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. అధిక సంఖ్యలో భక్తులు వాహనాల్లో రావటంతో కిలోమీటర్ల దూరం ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుంది. పోలీస్ వారు సమన్వయంతో ట్రాఫిక్ నియంత్రణ చేస్తే భక్తులకు ఇబ్బంది కలగకుండా చూస్తున్నారు.

కొత్తూరు సుబ్బరాయున్ని సందర్శించిన దేవాదాయ శాఖ ఉప కమిషనర్

విశాలాంధ్ర - పాణ్యం: ప్రముఖ దైవ క్షేత్రం మండల పరిధిలోని ఎస్.కొత్తూరు గ్రామంలో వెలిసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయమును దేవాదాయ శాఖ కర్నూలు ఉప కమిషనర్ గురు ప్రసాద్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో రామకృష్ణ ఆలయ ప్రధాన అర్చకులు వీరయ్యస్వామి, నారాయణ స్వామి, సురేష్ స్వామి, సిబ్బంది ఆలయ మర్యాదలైన పూర్ణకుంభంతో వారికి స్వాగతం పలికారు. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, నాగలింగేశ్వర స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు, విశేష పూజలు వారు నిర్వహించారు. అనంతరం శేష వస్త్రములు, శాలు వాలతో అర్చకులు వారిని సన్మానించి, స్వామివారి ప్రసాదం, ఫోటో ఫ్రేమ్‌ను అందజేశారు. ఆయన వెంట నందవరం చౌడేశ్వరి దేవ స్థానం అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సేవకురాలు లాల్ బీ మృతి

విశాలాంధ్ర - నందికొట్కూరు : మల్యాల గ్రామానికి చెందిన గ్రామ సేవకురాలు లాల్ బీ అనా రోగ్యంతో ఆది వారం తెల్ల వారు జామున మృతి చెందారు. విషయం తెలుసుకున్న నందికొట్కూరు మండల రెవిన్యూ ఆఫీసర్ శ్యామల దేవి తమ సిబ్బందితో కలిసి డిపార్ట్మెంట్ తరఫున మృతి చెందిన లాల్ బీ కుటుంబానికి రూ.25 వేలు అందజేయడం జరిగింది. గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం తరఫున రూ.5 వేలు గ్రామ రెవెన్యూ సహాయకులు ఆర్థిక సాయంగా అందజేశారు. గ్రామ రెవెన్యూ సహాయకులు మహే శ్వర, శివన్న, పవన్ కుమార్, మున్తుజావలి, శంకర్, మద్దయ్య పాల్గొన్నారు.

ఎల్కేఆర్ గ్లోబల్ స్కూల్ నందు స్టూడెంట్ కౌన్సిల్ ఇన్వెస్టర్ సెరామని

విశాలాంధ్ర - నంద్యాల : పట్టణం లోని ఎల్కేఆర్ గ్లోబల్ స్కూల్ నందు స్కూల్ స్టూడెంట్ కౌన్సిల్ ఇన్వెస్టర్ సెరామని కార్య క్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నంద్యాల ఎడిషనల్ ఎస్పీ కె.ప్రవీణ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా ర్థులు నాయకత్వ లక్షణాలను, వ్యక్తిత్వ వికాసం, వ్యక్తిగత స్వామర్థ్యా లను పెంపొందించుకోవాలని తెలిపారు. పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ కళ్యాణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆట పాటల్లోనూ రాణించాలని ప్రసంగించారు. ఈ కార్య క్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నిర్మలా దేవి, ఏవో రమణ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగానికి వ్యతిరేకం

విశాలాంధ్ర - పాములపాడు : దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అనుకూలంగా ఇచ్చిన తీర్పును నిరసిస్తూ, నవ్యాంధ్ర, రాయలసీమ మాల మహానాడు సంఘాల నాయకులు ఆదివారం మండల కేంద్రమైన పాములపాడులో కలబండి అంకన్న, నల్లమల అబ్రహంల ఆధ్వర్యంలో మాల మహానాడు నాయకులు, కార్యకర్తలు కలిసి నల్ల బ్యాడ్జీలు ధరించి సేవా భారతి కార్యాలయం నుండి బస్టాండ్ ఆవరణంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ విగ్రహం దగ్గర నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాల మహానాడు జిల్లా నాయకులు డి.రాజు, జూపాడుబంగ్లా డాక్టర్ నల్లమల్ల ఎర్రన్న, ఆత్మకూరు మాల మహానాడు మురహరి మల్లయ్య, తదితర నాయకులు మాట్లాడుతూ గతంలో 2004లో ఐదు మంది జడ్జిలతో ఎస్సీ వర్గీకరణ అంశాన్ని సుప్రీంకోర్టులో వేసిన ఇదే అత్యున్నత న్యాయస్థానం నేడు ఏడుగురు జడ్జీల ధర్మాసనం ఏ విధంగా వర్గీకరణ సమంజసమన్నారు. మాల మహానాడు నాయకులు డి.రాజు, డాక్టర్ నల్లమల్ల. ఎర్రన్న, మురహరి మల్లయ్య, నగేష్, సముద్రం క్రిస్టఫర్ పాల్గొన్నారు.

స్నేహమేరా జీవితం...

విశాలాంధ్ర - చాగలమర్రి : ఎదురు చూసే హృదయానికి ఓటమి లేదు, మదిలోని మంచితనానికి మరణం లేదు, అనుక్షణం తపించే స్నేహానికి అవధులు లేవు. స్నేహానికి కులం, మతం, హెూదా లేదు. బంధుత్వం కంటే గొప్పది, వజ్రం కంటే విలువైనదే స్నేహం. ఇలా స్నేహం గురించి చెప్పుకుంటూ పోతే రాయడానికి మాకు ఓపిక, చదవడానికి మీకు ఓపిక ఉండదు. ప్రపంచ స్నేహితుల దినోత్సవం ఆది వారం జరుపు కోవడానికి వయసుతో సంబంధం లేకుండా జరుపు కుంటారు. ప్రపంచ వ్యాప్తంగా ఫ్రెండ్ షిప్ డేకి చాలా ప్రత్యేకతలు ఉన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా వారివారి ప్రాంతాలు, సాంప్రదాయాలకు అను గుణంగా ఈ స్నేహితుల దినోత్సవాన్ని జరుపు కుంటారు. భాష లేనిది, బంధమున్నది, జీవి తంలో మనిషి మరువలేనిది స్నేహం ఒక్కటే అని ఇప్పటికే చాల మంది నిరూపించారు. ఆస్తులు, అంతస్తులు పక్కన పెట్టిన గొప్ప మనసు ఉన్న వాళు ఇప్పటికి మంచి మిత్రులుగా మిగిలిపోయారు. బాల్య స్నేహితులను ప్రతిరోజు గుర్తు చేసుకునే ప్రజలు ఫ్రెండ్‌షిప్ డే రోజు ఒకరికి ఒకరు ప్రత్యేక బహుమ తులు ఇచ్చి పుచ్చు కుంటారు. ఈ సందర్భంగా మన ప్రియమైన స్నేహితులు కొందరు వారి వారి అభిప్రాయాలను పంచుకున్నారు. మరి ఆలస్యం చేయకుండా స్నేహా నికి ఉన్న ప్రాముఖ్యత ఏంటో నంద్యాల జిల్లా చాగల మర్రి యువకులు వల్లంకొండు సాయి సుదర్శన్ రావు మాటల్లో ఇక్కడ తెలుసు కుందాం. స్నేహం లేదా స్నేహితులు అనేది మీరు ఒకరికికొరు ఉన్నారని తెలియజేయస్తుంది. అది ఆనందం అయినా, కష్ట మైనా వెన్నంటి ఉంటూ ఆనందించే బందం. స్నేహాన్ని మరింత అర్థ వంతంగా, ఆనంద దాయకంగా చేయడం లాంటిదని తెలిపారు. నాసిర్ పఠాన్ మాట్లాడుతూ స్నేహమంటే ఇదేరా అనేలా ఉన్నామని ఆయన అన్నారు. మిత్రులతో ఎప్పటికీ ఇలానే కలిసి జీవించాలి అన్నది తన కోరిక అని ఆయన తెలిపారు.

ఖవ్వ హత్య కేసులో నిందితులు అరెస్టు

- హత్య కేసులో ఏడుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు..

విశాలాంధ్ర - నంద్యాల : రౌడీ షీటర్ వెంకటసాయి అలియాస్ ఖవ్వను హత్య చేసిన ఏడుగురు నిందితులను అరెస్టు చేసినట్లు నంద్యాల డీఎసీత్పు రవీంద్రనాథ్ రెడ్డి తెలిపారు. ఆదివారం రాత్రి డీఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వెల్లడించిన వివరాల మేరకు.. జిల్లా ఎస్పీ ఆదిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు చాపిరేవుల బ్రిడ్జి వద్ద ఉన్న మూల పెద్దమ్మ గుడి దగ్గర నిందితులను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఏడుగురు నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుండి రెండు ఫోన్లను, ఒక ఇన్నేవా వాహనం, ఒక మోటార్ సైకిల్, నాలుగు కత్తులు, రెండు ఇనుప రాడ్లు స్వాధనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో మృతి చెందిన ఖవ్వమీద రౌడీషీటర్ ఉన్నదని, ఇతని మీద అనేక మర్డర్, అటెంప్ట్ మర్డర్లు, గంజాయి కేసులున్నాయని, గతంలో పీడీ యాక్ట్ పెట్టి కడప సెంట్రల్ జైలుకు పంపడం జరిగిందన్నారు. సంజీవకు గత రెండేళ్ల నుండి రియల్ ఎస్టేట్ పరంగా, ఆర్థికపరమైన మనస్పర్ధలు, రౌడీ షీటర్ రాజశేఖర్ హత్య విషయంలో నంద్యాల టౌన్ నందు ఆధిపత్యం విషయంలో హత్య చేయడం జరిగిందన్నారు.

నిందితుల వివరాలు : మహానంది మండలం అల్లినగరంకు చెందిన రాగినేని సంజీవ కుమార్ అలియాస్ సంజీవ, నెల్లూరుకు చెందిన నవీన్ కుమార్, నంద్యాలకు చెందిన వల్లపు సుబ్బరాయుడు, మదనగోపాల్, బంగి శివ అలియాస్ కుక్కల శివ, షేక్ మొహమ్మద్ ఇస్మాయిల్, చాకలి మద్దిలేటిలను అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. హత్య కేసు నిందితులను సవాలుగా తీసుకొని ఛేదించిన తాలూకా సీఐ దస్తగిరి బాబు, ఎస్ఐ నాగరాజులను వారి సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

పదో తరగతి పాసైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ

విశాలాంధ్ర - నంద్యాల : 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులైన 370 మంది ముస్లిం విద్యా ర్థులకు ఒక్కొక్కరికి రు.3 వేల నగదు చెక్కులను నంద్యాల అంజుమన్ సంస్థ పంపిణీ చేసింది. అంజుమన్ అధ్యక్షులు నశ్యం అబ్దుల్ ఖుద్దూస్ అధ్యక్షతన నిరాడంబరంగా జరిగిన ఈ కార్యక్రమంలో జమాఆతె ఇస్లామీ హింద్ నంద్యాల శాఖ అధ్యక్షులు షేక్ అబ్దుల్ సమద్, ఇమాముల సంఘం అధ్యక్షులు హాఫీజ్ అమ్జద్ బాష సిద్దీఖ్, అంజుమన్ ఉపాధ్యక్షులు సి.అబ్దుల్ హఖ్, కార్యదర్శి ఎండీ గౌస్, జీఎం మొహిద్దీన్, హిదాయతుల్లా, మున్నా, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖుద్దూస్ మాట్లాడుతూ ఈ సంవత్సరం అంజుమన్ సంస్థకు ధరాఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థి, విద్యార్థినికి రూ.3 వేల చొప్పున పదకొండు లక్షల విలువగల నగదు చెక్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు. అబ్దుల్ సమద్, హాఫీజ్ అమ్జద్ బాష మాట్లాడుతూ అంజుమన్ సేవలకు, జమాఆతె ఇస్లామి, ఇమాముల సంఘం, నంద్యాల ముస్లింల తరుపున అభినందిస్తూ అంజుమన్ ప్రజలది కాబట్టి పేద ముస్లింలు తమ అమ్మాయిల వివాహాలు అంజుమన్ సంస్థ ద్వారా చేయడానికి ముందుకు రావాలని కోరారు.

వైభవంగా చౌడేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలు

విశాలాంధ - బనగానపల్లె: మండలం పరిధిలోని నందవరం గ్రామంలో వెలిసిన శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారి జయంతి వేడుకలు ఆలయ కార్యనిర్వహనధికారి కామేశ్వరమ్మ ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిర రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వేద మంత్రోచ్చారణలతో ఆలయ అర్చకులు, ఈవో కామేశ్వరీ, ఆలయ అధికారులు బీసీ ఇంద్రారెడ్డికి ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మూగబోయిన ఆర్టీసీ అనౌన్స్‌మెంట్ మైకు

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు



విశాలాంధ్ర - అవుకు: ప్రయాణికుల సౌకర్యార్థం అవుకు బస్టాండు ప్రాంతంలో ఆర్టీసీ వారు ఏర్పాటు చేసిన అనౌన్స్మెంట్ మైకు పని చేయక పోవడంతో ప్రయాణి కులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటు న్నారు. నిత్యం వందలాది మంది ప్రయాణికులు తమ ప్రయాణాలను సాగించే వారి కోసం అవుకు బస్టాండ్ ప్రాంతంలో ఆర్టీసీ అధికారులు ఒక అనౌన్స్‌మెంట్ మైకును ఏర్పాటు చేశారు. దీనివల్ల అవుకు బస్టాండు కు రెండు కిలోమీటర్ల దూరంలో బస్సు వస్తున్నప్పుడు కండక్టర్ సిగ్నల్ ద్వారా ప్రయాణి కులకు మరి కాసేపట్లో బస్సు వస్తుందన్న సమాచారం అనౌన్స్మెంట్ రూపంలో ప్రయాణికులకు తెలిసేది. గత కొద్ది రోజుల నుండి మైకు పని చేయకపోవడంతో ప్రయా ణికులు టీ హెూటళ్లు, కూల్ డ్రింక్ షాప్ యజమా నులను బస్సు రాకపోకల సమా చారం అడిగి తెలుసు కుంటూ నానా అవస్థలు పడు తున్నారు. గతంలో ఉన్న బస్సు రాకపోకలకు సంబంధించిన బోర్డు లేదని ప్రయాణికులు వాపోతున్నారు.

ట్రాఫిక్ గైడ్‌ను పునరుద్ధరించాలి : బస్సు రాకపోకల సమయాలను ప్రయాణికులకు తెలియజేసేందుకు అవుకు బస్టాండ్ లో ట్రాఫిక్ గైడ్‌ను ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ గైడ్‌గా నియమించబడిన యాడికి ప్రసాద్ తన విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రయా ణికుల మన్ననలు పొందారు. జిల్లాల పునర్విభజనలో భాగంగా నంద్యాల జిల్లా నూతనంగా ఏర్పడడంతో జిల్లా ఆర్టిసి అధికారుల నుండి ట్రాఫిక్ గైడ్ యాడికి ప్రసాదుకు జీతం అందక తన సేవలను నిలిపి వేయడంతో ప్రయాణికులకు ఇక్కట్లు ప్రారంభ మయ్యాయి. ఒకవైపు మైకు పని చేయకపోవడం, మరోవైపు ట్రాఫిక్ గైడ్ లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇకనైనా ఆర్టీసీ అధికారులు స్పందించి ట్రాఫిక్ గైడును పునరు ద్ధరించి, బస్సు రాకపోకల సమయాలను సూచించే బోర్డును ఏర్పాటు చేసి, అనౌన్స్మెంట్ మైకును ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఖాజాకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూస్తా

విశాలాంధ్ర - బనగానపల్లె : పట్టణానికి చెందిన టీడీపీ కార్యకర్త ఖాజాకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూస్తామని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. ఖాజా అనారోగ్యంతో బాధపడుతూ పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయాన్ని తెలుసుకున్న బీసీ రాజారెడ్డి అక్కడికి వెళ్లి ఖాజా ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. షుగర్ లెవెల్స్ అధికంగా ఉన్నాయని సీరి యస్‌గా ఉందని వైద్యులు చెప్పడంతో బీసీ రాజారెడ్డి అంబులెన్స్‌ను ఏర్పాటు చేసి, మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తర లించారు. స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో బిల్లు డబ్బులు మొత్తం చెల్లించి తన ఉదార స్వభావాన్ని చాటుకున్నారు. నంద్యాలలోని వైద్యులతో మాట్లాడి ఖాజాకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూస్తామని బీసీ రాజారెడ్డి కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. నియోజ కవర్గ ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు రాయలసీమ సలాం, గోపాల్ పాల్గొన్నారు.

అంజుమన్ ప్రసిడెంట్‌గా మోమిన్ రసూల్ ఎన్నిక

విశాలాంధ్ర - వెలుగోడు : వెలుగోడు పట్టణ అంజుమన్ కమిటీ ప్రెసిడెంట్‌గా మోమిన్ రసూల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అంజుమన్ కమిటీ సభ్యులు తెలిపారు. మోమిన్ రసూల్ టీడీపీ జిల్లా మైనార్టీ సెల్ సభ్యునిగా పనిచేశారు. మైనార్టీల సంక్షేమం కోసం ఎన్నో సేవా కార్య క్రమాలు నిర్వహించారు. ఈయన ఎన్నిక పట్ల పట్టణం లోని మైనార్టీ నాయకులు, టీడీపీ నాయకులు అభినందనలు తెలిపారు.

ముస్లింలకు ఉమ్రా యాత్ర పవిత్రమైనది

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ: ముస్లింలకు ఉమ్రా యాత్ర ఎంతో పవిత్రమైన దని కౌన్సిలర్ హుస్సేన్ బాష, కొత్త మసీదు ఫేష్ ఇమామ్ నయు ముల్లా అన్నారు. ఆదివారం ఈద్గా వద్ద ఉమ్రా యాత్రకు వెళ్తున్న బస్సును జెండా ఊపి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఆళ్లగడ్డ తాలూకా నుండి 14 మంది ముస్లింలు ఉమ్రా యాత్రకు వెళ్తున్నారని వారి యాత్ర శుభప్రదం కావాలని అల్లాను ప్రార్థిస్తున్నా మన్నారు. మక్కాలోని దైవ గృహంలో అందరి క్షేమం సుఖసంతోషాల కోసం ప్రార్థించాలంటూ ఉమ్రా యాత్రికులను కోరారు.

నేడు చిన్నవంగలికి ఎమ్మెల్యే రాక

విశాలాంధ్ర - చాగలమర్రి : మండలంలోని చిన్నవంగలి గ్రామానికి సోమవారం ఆళ్ళగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఉదయం రానున్నట్లు టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు అన్సర్ బాష, మండల కన్వీనర్ లాయర్ నరసింహ రెడ్డి ఆదివారం తెలిపారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ చిన్నవంగలి గ్రామానికి చెందిన తలుపురెడ్డి గురుశేఖర్ రెడ్డి కుటుంబం గత రెండు రోజుల కిందట మృతి చెందిందన్నారు. వారి కుటుంబాని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పరామర్శించేందుకు ఆ గ్రామానికి వస్తున్నారన్నారు. మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని వారు కోరారు. కార్యక్రమంలో కొలిమి హుసేన్ వలి, షరీఫ్, గఫార్, జెట్టి నాగరాజు, అజీం, మాబులాల్, నాగూర్ తదితరులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల సీఐగా రమేష్ బాబు

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : కొలిమిగుండ్ల యూపీఎస్ నూతన సీఐగా రమేష్ బాబును పోలీసు ఉన్నతాధికారులు నియమించారు. ఇటీవల పోలీస్ అధికారులు సీఐ బదిలీలను చేపట్టిన బదిలీల్లో భాగంగా ఆళ్లగడ్డ సీఐగా ఉన్న రమేష్ బాబును వీఆర్‌కు పంపి అటు తర్వాత కొలిమిగుండ్ల సీఐగా నియమించినట్లు శనివారం రాత్రి ఉత్తర్వులు వచ్చాయి. అయితే ప్రస్తుత సీఐగా కొనసాగుతున్న గోపీనాథ్ రెడ్డిని బదిలీ చేస్తున్నట్లుగాని, రిలీవ్ చేస్తున్నట్లుగాని ఎక్కడ ప్రస్తావన లేకపోవడంతో పోలీసులలో అయోమయం నెలకొంది. ప్రస్తుత సీఐ రిలీవయి, కొత్త సీఐకి ఛార్జ్ అప్పగిస్తారా, లేదా ఇద్దరి సీఐలను కొనసాగిస్తారా, అన్నది తెలియాల్సి ఉంది. బదిలీలు చేపట్టే ముందు ఆ స్థానంలో ఎవరైనా ఉన్నారా, ఖాళీగా ఉన్నదా, అక్కడ ఉన్న అధికారిని ఎక్కడికి బదిలీ చేయాలి, లేదా ఎక్కడ రిపోర్ట్ చేయాలో తదితర వాటిని క్షుణంగా ప్రభుత్వం పరిశీలిస్తుంది. కానీ ఇవేమీ లేకుండా కొత్త సీఐని నియమించడం ఉన్న సీఐ ఎక్కడికి వెళ్లాలో తెలియని అయోమయ పరిస్థితి పోలీస్ శాఖలో నెలకొంది. ఒకటి, రెండు రోజుల్లో మరోసారి బదిలీలు జరిగే అవకాశం ఉందని, ఈ బదిలీల్లో ప్రస్తుత సీఐ బదిలీ అయ్యే అవకాశం ఉన్నట్లు పోలీస్ శాఖలో చర్చ సాగుతున్నది.

ఘనంగా చౌడేశ్వరి దేవి జయంతి..

విశాలాంధ్ర-చాగలమర్రి : పట్టణంలోని చిన్నమకానం వీధిలో వెలసిన శ్రీ చౌడేశ్వరి ఆలయంలో చౌడేశ్వరీదేవి అమ్మవారి జయంతి ఉత్సవం ఆదివారం కన్నుల పండువగా సాగింది. ఉదయం నుండి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అలంకరణ చేశారు. ఉదయం నుంచే భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ నిర్వహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. చక్రపాణి, దామోదర్, సుబ్బనర్సయ్య, రఘురామ్, ప్రదీప్, గుత్తి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత యోగ శిక్షణా తరగతులు ప్రారంభం

విశాలాంధ్ర - నంద్యాల : పట్టణం మున్సిపల్ పార్కులో గల ఆయుష్ యోగా కేంద్రంలో ఈనెల 7వ తేదీ బుధవారం నుండి ఉచిత యోగా శిక్షణ తరగతులు ప్రారంభమగునని నిర్వాహకులు ఖండే ఆనంద్ గురుజీ తెలియజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఖండే ఆనంద్ గురుజీ మాట్లాడుతూ ఈ శిక్షణ కాలంలో సూర్య నమస్కారములు, ప్రాణాయామము, ఆసనాలు, క్రియలు నేర్పబడునని, హాజరైన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి వారి అనారోగ్య సమస్యలు తెలుసుకుని గ్యాస్ ట్రబుల్, అల్సర్, ఎసిడిటి వంటి జీర్ణకోశ వ్యాధులు ఉన్నవారికి ఆసనములతో పాటు జలదౌతి క్రియను, సైనస్ ప్రాబ్లం, మైగ్రేన్ సమస్య ఉన్నవారికి జలనేతి, సూత్ర నేతి క్రియ ద్వారా, ఫైల్స్, ఫిస్టులా, ఫిషర్స్ వంటి మలబద్ధకం సమస్యలు ఉన్నవారికి శంఖ ప్రక్షాళన క్రియ చేపించబడునని గురుజీ తెలిపారు. థైరాయిడ్, పిసిఒడి, బీపీ, షుగర్, బ్యాక్ పెయిన్, ఊబకాయము ఉన్నవారికి ప్రత్యేక ఆసనములతో పాటు ప్రాణాయామం నేర్పబడునని, మానసిక ఒత్తిడితో బాధపడుతున్న వారికి, రక్తంలో ఒడిదుడుకులు తగ్గించి సమ స్థితిని తీసుకువచ్చేందుకు ధ్యానము నేర్పబడునని ఆయన అన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో...

వెలవెలబోతున్న చెరువులు..

- మరలా తగ్గుతున్న భూగర్భ జలాలు
- ప్రశ్నార్థకంగా మారుతున్న బోరు కింద సాగు పంటలు..

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : నడి వర్షా కాలంలో చెరువులు, కుంటలు వెలవెల బోతున్నాయి. వాగులు, వంకలలో జలసవ్వడి లేక మూగ బోతున్నాయి. దేశ వ్యాప్తంగా వరద బీభత్సంతో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు పాటు అపర ఆస్తి నష్టం జరుగుతుంటే మరోవైపు మండలంలో మాత్రం చినుకు జాడ కనబడడం లేదు. వేసవిని తలపించేలా రెండు రోజులుగా ఎండలు పెరగడంతో ఉక్కపోతతో ప్రజలు అల్లాడుతున్నారు. ఓరుగాలు తప్ప జల్లుల జాడ కనపడకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తీవ్ర వర్షాభావం వెంటాడడంతో మండలంలోని చెరువులు ఎండిపోయి భూగర్భ జలాలు కూడా తగ్గుముఖం పడుతున్నాయి. జులై మొదటి వారంలో అడపాదడపా కురిసిన మోస్తారు వర్షాలతో వర్షాధారంగా సాగుచేసిన పత్తి, కంది, మొక్క జొన్న పంటలు కూడా ఎదుగు బుదుగు లేకుండా ఎండు దశకు చేరు కుంటున్నాయి. భూగర్భ జలాలు తగ్గుముఖం పడుతుండడంతో ఆయాగ్రామాల పరిధిలో వ్యవసాయ బోర్లా కింద వరి సాగు ప్రశ్నార్థకంగా మారింది. వర్షాకాలం ప్రారంభయి, రెండు నెలలు అవుతున్న మండల వ్యాప్తంగా నేటి వరకు భారీ వర్షాలు కురువక పోవడంతో వంకలు వాగులు వట్టి పోతున్నాయి. మండలంలోని అతిపెద్ద చెరువు తిమ్మనాయుని పేట చెరువు, అబ్దుల్లా పురం దయాల్ చెరువు, కొలిమి గుండ్ల సమీపంలోని సద్దల వెంకన్న చెరువు, పెద్ద వెంతుర్ల గ్రామ సమీపంలో నల్ల చెరువు, ఎర్ర చెరువు, హనుమంతగుండం చిన్న చెరువు పెద్ద చెరువులు చుక్క నీరు లేని పరిస్థితి నెలకొంది. భారీ వర్షాలు కురిస్తే తప్పఆయా చెరువులు, వ్యవసాయ బోర్ల కింద వరి సాగైయ్యే పరిస్థితి లేదు. భూగర్భ జలం నానాటికి అడుగంటు తుండడంతో బోర్ల కింద సాగుచేసిన పండ్ల తోటల పరిస్థితి అయోమ యంగా మారింది. వరుణ దేవుడు కరుణిస్తే తప్ప సాగుకు ముందడుగు పడని దుస్థితి నెలకొంది.

రాజ్యాంగ విరుద్ధమైన వర్గీకరణను వెంటనే రద్దు చేయాలి

విశాలాంధ్ర - నందికొట్కూరు : ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ తీర్పు సుప్రీంకోర్టు ఇవ్వడం రాజ్యాం గానికి విరుద్ధమైందని, రాజ్యాంగానికి అవమానమని మాల మహానాడు నందికొ ట్కూరు నియోజవర్గ అధ్య క్షులు పబ్బతి శివప్రసాద్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లా డుతూ పార్లమెంటులో చర్చించ కుండా, పార్లమెంటు ఆమోదం పొంద కుండా, రాష్ట్రపతి ఆమోదించకుండా సుప్రీం కోర్టు ఎస్సీ, ఎస్టీల వర్గీకరణ చేయడం సుప్రీంకోర్టు ద్వారా రాజ్యాంగాన్ని మార్చడమే అన్నారు. ఇది ముమ్మాటికి రిజర్వేషన్లు తొలగించడానికి మనువాదులు పడుతున్న కుట్రే అన్నారు. ఈ వర్గీకరణ ద్వారా ఎస్సీ ఎస్టీలకు విద్య, ఉపాధి, ఉద్యోగ రంగాలలో తీవ్ర అన్యాయం జరుగుతుంద న్నారు. ఉన్నత విద్యా చదవడానికి ఉన్నత కళాశాలలో సీట్లు పొందడానికి, ప్రభు త్వం నుంచి పొంద్దె సబ్సిడీ రుణాలను దూరం చేసుకోవడమే అన్నారు. నిజంగా చెప్పాలంటే ఓసీలతో సమానంగా పోటీపడి సాధించుకోవడమే అన్నారు. ఎస్సీ ఎస్టీల రిజర్వేషన్ తొలగించడానికి బీజేపీ, ఆర్ఎస్ఎస్ మనువాదులు పనిన కుట్రలో వాడబడ్డ వారివల్ల తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. మేధావులు, అంబేద్కర్ వాదులు ఆలోచన చేసి, ఎస్సీ, ఎస్టీల మనుగడను దెబ్బతీసే ఈ వర్గీకరణ తీర్పును సుప్రీం కోర్టు వెనక్కి తీసుకునేలా కలిసికట్టుగా పోరాడేందుకు సిద్ధం కావాలన్నారు.

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, సోమవారం 05, ఆగస్టు 2024

శివారు కాలనీల సమస్యలు పరిష్కరించండి-సీపీఐ నేతల డిమాండ్

విశాలాంధ్ర-కర్నూలు సిటీ: నగరపాలక సంస్థ పరిధిలోని గీతా ముఖర్జీ నగర్, వీకర్ సెక్షన్ కాలనీల ప్రజలు సమస్యలతో సతమతమవుతు న్నారని, మున్సిపల్ అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని సీపీఐ సీనియర్ నాయకులు కె.జగన్నాథం, నగర కార్యదర్శి పి. రామ కృష్ణారెడ్డిలు కోరారు.ఆదివారం సీపీఐ నాయకులు నాగరాజు అధ్యక్షతన గీతాముఖర్జీ నగర్, వీకర్ సెక్షన్ కాలనీల ఆపార్టీ శాఖ సమావేశాలు నిర్వహించారు. ఈసమావేశానికి కే.జగన్నాథం, పి. రామకృష్ణారెడ్డిలు హాజరై మాట్లాడారు.గీతా ముఖర్జీ నగర్‌లో వార్డు సచివాలయం, హెల్త్ సెంటర్ ఏర్పాటు చేయక పోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు స్థానిక ప్రజలు సీపీఐ పార్టీ దృష్టికి తెచ్చినట్లు వారు తెలిపారు. వార్డు సచివాలయం, హెల్త్ సెంటర్ ఏర్పాటుతో పాటు పెండింగ్ లోని రోడ్లు, డ్రైనేజీ పనులను పూర్తిచేయాలని వారు కోరారు. ఇవే కాకుండా 60 సంవత్సరాల నిండిన ప్రతి మహిళకు పెన్షన్, రేషన్ కార్డు లేని అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని వారు కోరారు.వీకర్‌సెక్షన్ కాలనీలో గతప్రభుత్వం హౌసింగ్ బోర్డుకు ఇంటి పట్టాలు తాకట్టు పెట్టించి పేదలకు ఇందిరమ్మ గృహాలు మంజూరు చేసిందని వారు గుర్తు చేశారు. ఇంటి పట్టాలను లబ్దారులకు ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైయస్ జగన్ ప్రభుత్వంలో పేదల నుంచి రూ. 20 వేలు కట్టించుకుని ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్లు చేయించారని, ఆరిజిస్ట్రేషన్ పత్రాలు ఇప్పుడు బ్యాంక్ అధికారులు, రెవెన్యూ అధికారులు చెల్లుబాటు కావని లబ్ధిదారులకు చెప్పడం దారుణమని వారు పేర్కొన్నారు.

తక్షణమే పట్టాల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అలాగే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మహిళలకు ఉచిత బస్సు, ఇంటికి 3 సిలిండర్ల పథకాన్ని అమలు చేయాలని వారు కోరారు. సమావేశంలో ఆశాబేగం, నాగేశ్వరమ్మ,సోఫియా, రాముడు, గౌస్,బాలకృష్ణ, శ్రీకాంత్, రహంతుల్లా, రెహమాన్, శాఖ సభ్యులు పాల్గొన్నారు.

ఉన్నతి దరఖాస్తులపై ఆరోపణలు వెలువ

- దేవుడు వరమిచ్చిన పూజారి వరమివ్వని పరిస్థితి
- సమన్వయ లోపంతో నిలిచిపోయిన 250 దరఖాస్తులు
- సీసీ... ఏపీఎం ఇలా తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మహిళలు
- ఎస్సీ, ఎస్టీ పొదుపు మహిళలకు అందని ద్రాక్షలా సబ్ ప్లాన్ నిధులు
- పీడీకి ఫిర్యాదు చేసిన ఉలిందకొండ మహిళలు

విశాలాంధ్ర-కల్లూరు: ఎస్సీ, ఎస్టీ మహిళల అభ్యున్నతి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సబ్, ప్లాన్ నిధులు అర్హులైన పొదుపు మహిళలకు అందించడంలో వారి చేతి వాటం కోసం అధికారులు తీవ్ర అలసత్వం వహిస్తున్నారనె ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఈ మేరకు మండల పరిధిలోని ఉలిందకొండ గ్రామంలో దాదాపు 35 గ్రూపులు ఎస్సీ, ఎస్టీ పొదుపు మహిళల గ్రూపులు గత కొన్నేళ్లుగా నుండి పొదుపు సంఘాలుగా ఏర్పడి రూపాయి రూపాయి పొదుపు చేస్తూ వారి జీవన బాట మెరుగు పరచుకొని వారి కుటుంబాలను ఆదర్శంగా నిలుపుకుంటూ ముందుకు సాగుతున్నారు. ప్రభుత్వం విడుదల చేసిన ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు మండలంలో దాదాపు కోటి 20 లక్షల వరకు మిగిలిపోయి ఉండడంతో ఉలిందకొండ గ్రామం నుండి దాదాపు 250 మంది 60 సంవత్సరాల లోపు వయసు గల పొదుపు మహిళలు ఉన్నతి పథకం ద్వారా ఒక్కొక్క మహిళా 50వేల రూపాయల చొప్పున రుణం పొందేందుకు గత 20 రోజుల క్రితం అర్హులైన మహిళలు దరఖాస్తులు చేసుకున్నారు. అయితే మహిళల దరఖాస్తులపై బుక్ కీపర్, సీసీ, గ్రామైక్య సంఘం,ఏపీఎం, మహిళా సమైక్య సభ్యురాళ్లు ఆమోదించి వచ్చిన దరఖాస్తులపై సంతకాలు చేసి అర్హులైన మహిళలకు ఆన్లైన్ చేసిన తర్వాత వారం రోజుల్లో వారి ఖాతాల్లో రుణం మొత్తం జమ చేయాల్సిన పరిస్థితిలో ఉన్నాయి. గ్రామంలో తీర్మానం చేసుకొని మండల ఏపీఎం దృష్టికి దరఖాస్తులు వెళ్లడంతో గ్రామంలో పనిచేసే సీసీ శారదమ్మ తన ప్రమేయం లేకుండా ఏపిఎం దగ్గరకు ఎలా దరఖాస్తులు తీసుకెళ్తారని గ్రామంలోని కొంతమంది మహిళలపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు మహిళలు పేర్కొంటున్నారు. ఈ దరఖాస్తులపై సంతకం చేసేది లేదంటూ గత వారం రోజుల కింద నుండి ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు మహిళలు వాపోతున్నారు. ఈవిషయంపై జిల్లా పీడీకి కూడా గ్రామ టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో పొదుపు మహిళలు శుక్రవారం వెళ్లి సీసీ శారదమ్మపై, ఏపీఎం శ్రీనివాస్‌గౌడ్‌లపై ఉలిందకొండ మహిళలు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఉన్నతి దరఖాస్తులపై సంతకాలు పెట్టాలంటే చేతులు తడపాల్సిందేనని అలా చేయకపోవడం చేతనే వారి వాటా కోసం ఒకరిపై ఒకరు నెట్టుకుంటూ కుంటి సాకులు చెబుతూ దరఖాస్తులు ముందుకెళ్లకుండా అడ్డుకుంటున్నారని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిలిచిపోయిన ఉన్నతి దరఖాస్తులు పూర్తిచేసి త్వరగా సబ్‌ప్లాన్ నిధులు అందేలా చూడాలని వేడుకుంటున్నారు. వాటితో పాటు శ్రీనిధి దరఖాస్తులు కూడా పరిస్థితి అలాగే ఉందని, సకాలంలో రుణాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు.

ఈ విషయంపై సీసీ శారదమ్మను వివరణ కోరగా ఉన్నతి దరఖాస్తులు చేసుకున్న విషయం నాకు తెలియదని ఈవిషయం ఏపీఎంకు మాత్రమే తెలుసని ఏమైనా సమాచారం కావాలంటే ఏపీఎం సంప్రదించి తెలుసుకోవాలని, తాను ఈ దరఖాస్తును సంతకం చేయకుండా ఉద్దేశపూర్వకంగా ఆపలేదని మహిళల అభ్యున్నతి కోసమే తాను పాటుపడుతున్నట్లు తెలిపారు. ఏపీఎం శ్రీనివాస్‌గౌడ్‌ను ఈ విషయంపై వివరణ కోరగా తాను మీటింగ్‌లో ఉన్నాను తర్వాత మాట్లాడుతాను అంటూ సమాచారం తెలిపారు. -సీసీ శారదమ్మ

జాడలేని వరుణుడు.. ఎండుతున్న పంటలు

విశాలాంధ్ర-గోనెగండ్ల: వేరుశనగ పంటలు వర్షాలు లేక ఎండిపోతున్నాయి. వరుణ దేవుడు కూడా కరువయ్యాడని మండల రైతన్నలు కన్నీటీ పర్యంతమవుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగుచేసిన పంటలు మండల వ్యాప్తంగా వేరుశనగ 4వేల ఎకరాలు కాగా.. పత్తి సైతం 20వేల ఎకరాలు సాగు చేశారు.మండలంలో కొర్ర,సజ్జ, కందులు, ఆముదంతో కలిపి మరో 2 వేల ఎక రాలు సాగైంది. ఇదిలా ఉండగా సాగు కావాల్సిన పంటలు మిరప, ఉల్లి, మెక్కజొన్న పంటలు దాదాపు 6 వేల ఎకారాలు సాగు కావాల్సింది. ఒక పక్క సాగు చేసిన పంటలు వర్షాలు లేకపంటలు ఎండిపోతున్నాయని పొలాలో ఉన్న బోర్లు కూడా నీళ్ల లేక ఎండిపోయాయి. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే గోనెగండ్ల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని గోనెగండ్ల రైతులు కోరుతున్నారు.

గోనెగండ్ల మండలంలో రైతులు సాగు చేసిన పంటలకు ఈ క్రాఫ్‌బుకింగ్ చేసుకోవా లని వ్యవసాయాధికారిణి హేమలత తెలిపారు.ఈ సందర్భంగా ఏవో హేమలత మాట్లాడుతూ రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకాలు,ఆర్ఓఆర్, బ్యాంకు పాసు పుస్తకాలకు సంబంధించిన జిరాక్స్‌లను రైతు భరోసా కేంద్రాల్లో అందజేయాలని సూచించారు.ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. -ఏవో హేమలత

మధ్యాహ్న భోజన పథకం వివాదాన్ని పరిష్కరించండి

విశాలాంధ్ర-ఆదోనిరూరల్ : మండలంలోని ప్రభుత్వ పాఠశాల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకంలో ఏర్పడుతున్న వివాదాలు పరిష్కరించాలని ఎస్టీయూ రాష్ట్ర అకడమిక్ కమిటీ సభ్యులు, రాష్ట్ర కౌన్సిలర్ మహదేవప్ప డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎస్టీయు భవన్లో ఆదోని,కౌతాళం ముఖ్య నాయకుల సమావేశాన్ని ఆదోని మండల ఆర్థిక కమిటీ కార్యదర్శి షేక్షావలి అధ్యక్షత వహించారు. ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ మార్పు విషయంలో నెలకొంటున్న వివాదాలలో ప్రభుత్వం ప్రత్యేక చొరవతో వెంటనే పరిష్కరించాలని కోరారు. మండగిరి ఆర్జీ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గణేకల్ ప్రాథమికోన్నత పాఠశాల పలు గ్రామాలలో మధ్యాహ్న భోజనం పథకం ఏజెన్సీ మార్పు విషయమై రాజకీయ పార్టీలు ఒకరిపై ఒకరు వివాదాల సృష్టించుకోవడంతో ఉపాధ్యాయులు తీవ్ర స్థాయిలో ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అధికారుల స్పందిస్తూ త్రీ మెన్ కమిటీపై ఒత్తిడి తీసుకువచ్చి జరిగిన చోట ఆర్డర్ కాపీలు ఇచ్చి మెనూ ప్రకారం కేటాయించిన పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహించేటట్లు ఆదేశాలు ఇవ్వాలని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా గణప ప్రధాన కార్యదర్శి ఎంసి.సుంకన్న,జిల్లా కార్యదర్శి గోపాల్,జిల్లా ఆర్థిక కమిటీ సభ్యులు రామాంజనేయులు ఆదోని మండల అధ్యక్ష,కార్యదర్శులు చింతకుంట రామకృష్ణ, సుధాకర్ బాబు తదితరులు ఉన్నారు.

విద్యా, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం చేయాలి-ఎస్టీయూ

విశాలాంధ్ర-కోడుమూరు: నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం విద్యా, ఉపాధ్యాయ రంగ సమస్యలను సత్వరమే పరిష్కారం చేసి విద్యా రంగంగాన్ని బలోపేతం చేయాలని రాష్ట్ర ఉపాధ్యాయ పూర్వపు ప్రధాన కార్యదర్శి హెచ్. తిమ్మన్న, జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సి నాగ రాజు, బి.వెంకటేశ్వర్లు,బి.నాగరాజులు ప్రభుత్వాని డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్టీయూ ముఖ్య నాయకుల ప్రాంతీయ సమావేశం స్థానిక కొండపేట ప్రాథమిక పాఠశాలలో శ్రీనివాసులు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాలు, విడుదల చేసిన జీవోల వలన ప్రభుత్వ విద్యారంగం, ముఖ్యంగా ప్రాథమిక విద్య నిర్వీర్యం అయ్యే పరిస్థితికి చేరుకుందని, సత్వరం ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసే నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉన్నత పాఠశాలలో విలీనం చేసిన 3,4,5 తరగతులను ప్రాథమిక పాఠశాలలో కొనసాగింపు, ఉన్నత పాఠశాలలో ఆంగ్ల మధ్యమంతో పాటు తెలుగును సమాంతర మాధ్య మంగా కొనసాగించాలని. ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాలను తగ్గించాలని, ఉపాధ్యాయుల కొరతను పని సర్దుబాటు లేదా ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా నియమించాలన్నారు. తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలలకే వర్తింపచేయాలని కోరారు.అన్ని మేనేజ్మెంట్‌ల ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని,పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు.12వ పిఆర్సీ ఆలస్యం అవుతున్నందున వెంటనే 30% మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పాత పెన్షన్ అమలు చేయాలని కోరారు.రాష్ట్రంలోని ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్లకు చెల్లించవలసిన బకాయిల చెల్లింపు. ప్లస్ టు పాఠశాలల్లో రెగ్యులర్ ప్రాతిపదికన పదోన్నతులు చేపట్టాలన్నారు. సీనియర్ నాయకులు పి.దేవేంద్రప్ప,శ్రీనివాసులు,వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆయాకట్టు రైతులకు సాగునీరవ్వండి..టీడీపీ ఇన్‌ఛార్జ్ వీరభద్రగౌడ్

విశాలాంధ్ర-హెరాళగుంద: తుంగభద్ర ఎల్లెల్సి దిగువ కాల్వ కింద సాగు చేసుకుంటున్న అయాకట్టు రైతులకు సాగునీరు ఇవ్వాలని టీడీపీ తాలుకా ఇన్ ఛార్జ్ వీరభద్రగౌడ్ అన్నారు. ఆదివారం చింతకుంట నుంచి బాపురం మీదుగా హెరాళగుంద వరకు భారీ వాహనాలతోఎల్లెల్సీ కాల్వపై పర్యటించారు. రైతులకు రావల్సిన నీటి వాటాపై కోతలు విధిస్తూన్నారని.తమ రైతులకు తీరని అన్యాయం జరిగుందని టిబిపీ బోర్డు అధికారులతో చర్చించారు. కర్ణాటక రైతులు ఆక్రమ జలచౌర్యానికీ పాల్పడుతున్నారని. జలచౌర్యాం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. హెరాళగుంద రైతులకు డిస్ట్రిబ్యూటర్ విడుదల చేస్తున్న నీటిపై మరీంత పెంచాలని అధికారులను ఆదేశించారు. దీంతో రై తులు హర్షం వ్యక్తం చేశారు. చివరి అయకట్టు రైతులకు అన్యాయం జరిగితే ఊరుకోనని అధికారులను హెచ్చరించారు. ఆలూరు నియోజక వర్గం టీడీపీ ఇన్చార్జ్ వీరభద్రగౌడ్ వెంట తుంగభద్ర బోర్డ్ అధికారులు, తుంగభద్ర ప్రాజెక్టు అధికారులు, టీడీపీ నాయకులు మాజీ మండల టీడీపీ కన్వీనర్ పి.వీరన్న గౌడ్, ఎం.వరప్రసాద్, ఎం.రమేష్, కొడాలి వేణుగోపాలరావు, కిరణ్, మురళి, మోయిన్,జె బసవ, అతావుర్ రహ్మాన్, అబ్దుల్ సుభాన్, జుమ్మా సలీం, దుర్గాప్ప, పంపాపతి, జాకీర్, టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత స్వయం ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-కర్నూలు సిటీ: స్వయం ఉపాధి పొందాలనుకునే ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువత లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూల్ మెల్విన్ జోన్స్ ఆధ్వర్యంలో ఇస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరీ చరిత పేర్కొన్నారు. ఆదివారం ఎమ్మెల్యే స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో ఈనెల 12న ఇంటర్నేషనల్ యూత్‌డేని పురస్కరించుకొని తెలుగు డీటీపీలో ఇవ్వనున్న ఉచిత శిక్షణ ప్రచారగోడ పత్రికలను గౌరు చరిత, లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూల్ మెల్విన్ జోన్స్ ప్రతినిధి లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ ,గౌరు వెంకటరెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూల్ మెల్విన్ జోన్స్ ఉప కార్యదర్శి లయన్ చిన్నస్వామి, సీనియర్ సిటిజన్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.నాగరాజు, కిష్టఫర్, దుగ్గపూటి నాగిరెడ్డి విడుదల చేశారు. అనంతరం లయన్స్ క్లబ్ సభ్యులు, సీనియర్ సిటిజన్స్ గౌరు చరితకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ చేస్తున్న సేవా కార్యక్రమాలు కొనియాడారు. లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతినెలా 30 మంది నిరుద్యోగ యువతీ యువకులకు క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.గౌరు చరిత జన్మదినాన్ని పురస్కరించుకొని మొక్కలు, పండ్లు పంపిణీ చేసినట్లు రాయపాటి తెలిపారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-కల్లూరు: పందిపాడు తెలుగుదేశం పార్టీ తరపున పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత పుట్టినరోజు సందర్భంగా అర్ధరాత్రి నుండి జన్మదిన వేడుకలు ప్రారంభమైనాయి. ముఖ్యంగాపందిపాడు నుండి వందల సంఖ్యలో గౌరు అభిమానులు, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు అధికసంఖ్యలో హాజరై గౌరు చరితకు శుభాకాంక్షలు తెలిపారు. కేకును కట్ చేసి బాణసంచా పేలుస్తూ మిఠాయిలు పంచు తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దేవేందర్‌రెడ్డి, శేఖర్‌చౌదరి, శివశంకర్, లక్ష్మణ యాదవ్, కురువ భీష్ముడు, నాగరాజు,కె.రామాంజనేయులు, శివ, రవి, వంశీ, చిన్న, శంకర్, బాలు, కిషోర్ వెంకటేష్, గ్రామ ప్రజలు తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగ ఉండండి

విశాలాంధ్ర-హెరాలగుంద: మండలంలో ప్రజలు విద్యార్థులు గంజాయి ఉంచకూడదని మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై పెద్దయ్య నాయుడు కోరారు. స్థానిక బస్టాండ్‌లో గంజాయి మరియు మత్తు పాదార్థాల నిర్మూలనకు అందరూ సహకరించాలంటూ అవగాహన నిర్వహించారు. గంజాయి, మత్తు పదార్థాలు సేవించడం వల్లఆరోగ్యాలు దెబ్బతింటాయని అలాగే దీనివల్ల ఎన్నో నేరాలు జరుగుతాయన్నారు. మండలంలో ఎవరైనా సరే గంజాయి, మత్తు పదార్థాలు అమ్మితే వారిపై కఠిన చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. బస్టాండు, స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో గోడ పత్రిక విడుదల చేశారు. గంజాయి మత్తు పదార్థాల నిర్మూలన గట్టి నిఘా ఉంచామన్నారు.యువత గంజాయి, మత్తు పదార్థాలు సేవించకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉన్నదని అందుకోసం వారి పట్ల జాగ్రత్త వహించాలని విజ్ఞప్తి చేశారు కార్యక్రమంలో పోలీసులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన దేవరగట్టు

విశాలాంధ్ర-హెరాళగుంద: మండలంలోని నేరనికి దేవరగట్టు మాల మల్లేశ్వర స్వామి ఆలయం ఆదివారం భక్తులకు కిటకిట లాడింది. పూజార్లు పంపయ్య స్వామి, మహేష్‌లు స్వామివారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం,రుద్రాభిషేకం, మహామంగళ హారతితో పూజించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు స్వామివారిని నియోజకవర్గం టీడీపీ ఇన్చార్జ్ వీరభద్ర గౌడ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి భజన కార్యక్రమాలు జరిగాయి. శ్రావణమాసం ప్రారంభం సందర్భంగా దేవరగట్టు మాలమల్లేశ్వర స్వామి, హెరాలగుంద సిద్దేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.హెరాళగుంద బస్టాండులోని నాగప్ప కట్టకు భక్తులు పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు

డోలమేట్ పౌడరు తరలిస్తున్న లారీని పట్టివేత

విశాలాంధ్ర-జిల్లా పరిషత్ : ప్యాపిలి నుంచి హైదరాబాదుకు డెవలప్మెంట్ పౌడర్‌ను అక్రమంగా తరలిస్తున్న లారీని ఆదివారం ఉలిందకొండ దగ్గర విజిలెన్స్ రాయల్టీ ఇన్స్పెక్టర్ నవీన్ సిబ్బంది పట్టుకోవడం జరిగింది. రక్షణ నిమిత్తం ఉలిందకొండ పోలీస్ స్టేషన్లో లారీని ఉంచడం జరిగిందని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి.రాజశేఖర్ విలేకరులకు తెలిపారు.

నేడు నగరపాలకలో ఫిర్యాదుల స్వీకరణ

విశాలాంధ్ర-కర్నూలు సిటీ : నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని కమిషనర్ పి.వి. రామలింగేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలకకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే అర్జీ, ఆధార్, మొబైల్ నెంబర్‌తో వచ్చి ప్రజలు ఫిర్యాదు చేయవచ్చున్నారు. సమస్యలకు సత్వరపరిష్కారం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు.

ఉరుకుంద దేవస్థానానికి పాదయాత్ర

విశాలాంధ్ర-పెద్దకడబూరు: కౌతాళం మండల పరిధిలోని ఉరుకుందలో వెలసిన శ్రీశ్రీశ్రీ నరసింహ ఈరన్న స్వామి దేవస్థానానికి ఆదివారంఅమవాస్యను పురస్కరించుకుని పెద్ద కడబూరుకు చెందిన భక్తులు పాదయాత్రతో తరలి వెళ్లారు. ప్రతి అమవాస్యకు పెద్దకడబూరు నుండి ఈరన్న స్వామి భక్తులు పాదయాత్ర ద్వారా ఉరుకుంద చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకుంటున్నారు. ఈ పాదయాత్రలో వైసీపీ నాయకులు చంద్రశేఖరరెడ్డి, ఉప సర్పంచు విజేంద్రరెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పరవళ్లు తొక్కుతూ సాగర్ వైపు పరిగెత్తుతున్న కృష్ణమ్మ

పర్యటకుల సందడి..తప్పని ట్రాఫిక్ సమస్యలు



విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: పాలసముద్రం వలె నూరుగలు కక్కుతూ సాగర్‌వైపు కృష్ణమ్మ పరుగులు తీస్తుంది. కృష్ణా పరీవాహక ప్రాంతంలో వరదల కారణంగా ప్రాజెక్టు లు నిండి పోవడంతో దిగువ శ్రీశైలం జలాశయానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది. సుంకేసుల నుండి 4,50,064 క్యూసెక్కులు, జూరాల నుండి2,98,573 క్యూసెక్కులు 7,48,633 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. స్పిల్‌వే ద్వారా 10 గేట్లు 20 అడుగుల మేరా ఎత్తి దిగువకాజ్ 5,50,731 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఏ పీ జలవిద్యుత్‌కు 24,618 క్యూసెక్కులు, తెలంగాణ జలవిద్యుత్‌కు 38,050, మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా 25వేల క్యూసెక్కులు, హంద్రీనీవా ద్వారా 1013 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. జలాశయం పూర్తి నీటి మట్టం 885.807 అడుగులు కాగా ప్రస్తుతం 882 అడుగులు ఉన్నాయి. జలాశయాలు పూర్తి నీటి సామర్థ్యం 215.టీఎంసీలు కాగా ప్రస్తుతం జలాశయంలో 200.19 టీఎంసీ నీరు నిల్వ ఉంది. ప్రాజెక్ట్ గేట్లు ఎత్తి దిగువకు నీళ్ల వదలడం చివర కావడం వలన పర్యాటకులు అయి ఏపీ, తెలంగాణ నించి పెద్దఎత్తున తరలి రావడంతో ట్రాఫిక్ నిలిచి పోయాయి. దీంతో పర్యటకులు బాగా ఇబ్బంది పడ్డారు. పర్యాటకుల తాకిడితో శ్రీశైల భ్రమరాంబిక మల్లికార్జున స్వామి అమ్మవార్ల దర్శనం కోసం రావడంతో భక్తులు దర్శనము కోసం గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండాలసి వచ్చింది.

అంగన్వాడీలకు మంచినీటి పైప్‌లైన్ ఏర్పాటు

విశాలాంధ్ర-హెరాళగుంద : మండలంలోని హెబ్బటంలోని అంగన్వాడి 1, 2, కేంద్రాలకు కొత్త మంచినీటి పైపు లైన్ ఏర్పాటు చేసి తాగునీరు సరఫరా చేశామని ఇన్చార్జ్ గ్రామ కార్యదర్శి బి రాజశేఖర్ గౌడ ఆదివారం తెలిపారు. అలాగే ఆరోగ్య ఉప కేంద్రానికి, వెంకటగిరి కాలనీ, ఎస్టీ కాలనీ ప్రజలకు కొళాయిలు వేసి మంచినీరు అందించామని గ్రామంలోని ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తీరుస్తున్నామని గ్రామ అభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామంలో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు చేపట్టామని మురుగునీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీలు శుభ్రపరుస్తున్నా మని అలాగే దోమల లార్వా చంపడానికి డ్రైనేజీలో, మురికిగుంటల్లో యాసిడ్ మందు వేస్తున్నామన్నారు. గ్రామ సుందరీకరణకు ప్రజలు ఎక్కడంటే అక్కడ పారిశుద్ధ్యాన్ని వేయకూడదని విజ్ఞప్తి చేశారు. సర్పంచ్ నాగవేణి ఆధ్వర్యంలో పైప్ లైన్ నిర్మాణం చేశామని అన్నారు.

విశేషంగా అమావాస్య పూజలు

విశాలాంధ్ర-మద్దికెర : మద్దికెర మద్దమ్మకుంట సమీపంలో వెలసిన కలియుగ ప్రత్యక్ష దైవం కుజగ్రహ సర్పదోష నివారకుడు సంతాన వరదడైన సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఆది వారం అమావాస్య సందర్భంగా పంచామృత అభిషేకాలు, కుంకుమార్చనలు, సామూహిక హెూమం పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు ఎస్. విజయ్ ప్రసాద్ యాదవ్ తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తాదులు పాల్గొన్నారు..

గోనెగండ్లలో ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-గోనెగండ్ల: మండల కేంద్రమైన గోనెగండ్ల లో ఆదివారం స్థానిక చింతాలమునిని,నల్లారెడ్డి,స్వాములు,అంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.శ్రావణమాసం సందర్భంగా గ్రామంలో మహిళలు, వృద్దులు, యువకులు, పిల్లలు, ఆలయాల్లోని స్వాములకు ఆకు పూజ, అర్చన,ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈపూజ కార్యక్రమంలో సర్పంచు పూజారి హైమవతి, విశ్వనాథ్‌రెడ్డి, జంగం ప్రకాష్,కప్పల గోవిందు, ముని స్వామిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, సోమవారం 05, ఆగష్టు 2024

ముప్పై ఏళ్ల మాదిగల చిరకాల స్వప్నమే ఎస్సీ వర్గీకరణ

విశాలాంధ్ర-ఆస్పరి : ముప్పై ఏళ్ళు ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ అలుపెరుగని పోరాటం చేశారని ఆ పోరాట ఫలితంగానే ఇటీవల సుప్రీంకోర్టులో ఎస్సీ వర్గీకరణ సమంజసమైందని సుప్రీమ్ కోర్టు తీర్పు వెల్లడించడంతో ఆదివారం మండల పరిధిలోనే నగరూరు గ్రామంలో విజయోత్సవ సభను స్థానిక ఎమ్మార్పీఎస్ నాయకులు ఘనంగా నిర్వహించుకున్నారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మిఠాయిలు పంచుకు న్నారు. అనంతరం మాజీ ఎంపీటీసీ మురళీమోహన్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు గోవిందరాజులు, రైల్వే ఈరన్న, పేతురు, రామాంజినేయులు, పురందర్ లు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమైందన్నారు. ఎస్సీ వర్గీకరణ వల్ల ఎస్సీ, ఎస్టీలలో ఉప కులాలు అందరికీ సమాన వాటా దక్కినప్పుడు సమాన అభివృద్ధి జరిగి సామాజిక న్యాయం సిద్ధిస్తుందన్నారు. మాదిగలు చిరకాల చిరకాల స్వప్నం ఎస్సీ వర్గీకరణ అని మందకృష్ణ మాదిగ పోరాట ఫలితంగానే షెడ్యూల్ కులాల వర్గీకరణ సాధ్యమైందని, మాదిగలు విద్యా ఉద్యోగ రంగాలలో అగ్రభాగాన నిలవడానికి ఎస్సీ వర్గీకరణ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, గ్రామ పెద్దలు మురళీ, భీమన్న, చిన్న నరసన్న, సోమశేఖర్,తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ప్రచారం కోసమే మ్యూజిక్ ఆఫ్ హెూప్ విడుదల

విశాలాంధ్ర - పాణ్యం : వంధ్యత్వంపై అవగాహన ప్రచారం కోసమే మ్యూజిక్ ఆఫ్ హెూప్ ప్రారంభించినట్లు ఫెర్టీ 9 ఫెర్టిలిటీ సెంటర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీఈఓ దినేష్ గాధియా వెల్లడించారు. ప్రపంచ ఐవిఎఫ్ దినోత్సవం పురస్కరించుకొని వాటి విధానాల్లో సంపూర్ణత, ప్రశాంతత ప్రాముఖ్యతను నొక్కి చెప్పడానికి ఇది ఎంతగానో దోహద పడుతుందని అన్నారు. ముఖ్య అతిథులు, ఐవీఎఫ్ పిల్లలు వారి కుటుంబ సభ్యులు ఫెర్టీ 9 ట్యూన్‌ను ఆయా కేంద్రాల్లో విడుదల చేసి నట్లు చెప్పు కొచ్చారు. వారి హాజరు ఐవీఎఫ్ చికిత్స, సంతోషం, విజయాన్ని వెల్లడి చేస్తుందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అనంతరం మెడికల్ డైరెక్టర్ డాక్టర్ జ్యోతి సి.బుడి మాట్లాడుతూ వంధ్యత్వానికి సంబంధించి అవగా హన పెంచేందుకు, వారిలో నెలకొన్న అపోహలు పోగొట్టేందుకు చేయడానికి కొనసాగుతున్న ప్రచారాన్ని పూర్తి చేయడం ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుందన్నారు. అందుకు అనుగుణంగా రెండు తెలుగు రాష్ట్రాల్లోని ముఖ్యమైన 15 ప్రాంతాల్లో వీధి నాటకాలు, ఫెర్టి 9 ట్యూన్ విడుదల ఐవీఎఫ్ గురించి బహిరంగ చర్చను ప్రారంభిం చడం తో పాటుగా అవగాహన కల్పించా ల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నాణ్యతలో రాజీ పడకుండా వంధ్యేత్వ చికిత్సలు అందుబాటు ధరలకు అందిస్తున్న పుడు మా రోగులందరికీ కారుణ్య సంరక్షణ, మద్దతు అందించడానికి తాము కట్టుబడి ఉన్నామని తెలపడానికి తమకెంతో గర్వంగా ఉంద న్నారు. ఈ నిబద్ధతకు అనుగుణంగా, మేము ఐవిఎఫ్ విధానాలపై ప్రత్యేకంగా 25 శాతం తగ్గింపు అందిస్తున్నట్లు ఈ సందర్భంగా డాక్టర్ జ్యోతి సి.బుడి వెల్లడించారు.

విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయండి

విశాలాంధ్ర - నందికొట్కూరు : నందికొట్కూరు పట్టణంలో సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహించే ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ రాజు మాదిగ తెలియజేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న మాదిగ, ఉప కులాల నాయకులు ఎన్‌డీఏ పార్టీల నాయకులు కార్యకర్తలు ఎమ్మార్పీఎస్‌కు 30 ఏండ్ల పోరాటంకు ప్రత్యక్షంగా పరోక్షంగాను సహకరించిన సమాజంలోని అన్ని కులాల పెద్దలకు, పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా ఈ ర్యాలీలో ముఖ్యఅతిథిగా నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయ సూర్య పాల్గొని కేక్ కట్ చేసి మహనీయులకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చిత్రపటానికి మాదిగ సబ్బండ వర్గాల కోసం నిరంతరము కృషిచేసిన మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తారన్నారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వంలో ఉండే వివిధ విభాగాల అధికారులకు సహకరించాలని మాదిగ దండోరా తరఫున మందకృష్ణ మాదిగ నాయకత్వం తరఫున విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ టౌన్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బోల్లెద్దుల రాజన్న, టీడీపీ యువ నాయకులు రగడ, మాదిగల రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు పానుగంటి నాగరాజు, దిబ్బన్న మాదిగ, పల్లె పుల్లంరాజు మాదిగ, సున్నపు నాగరాజు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీశ్రీ చౌడేశ్వరి దేవి పుట్టినరోజు సంబరాలు

విశాలాంధ్ర - మిడుతూరు : నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజవర్గంలోని మండల కేంద్రమైన మిడుతూరులో ఆదివారం తొగుటవీర క్షత్రియుల ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ చౌడేశ్వరి దేవి పుట్టినరోజు సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిడిపి సీనియర్ నాయకులు కాతా రమేష్ రెడ్డి పాల్గొని బోనాలు కుండ ఎత్తుకొని సంబరాలు జరిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మిడుతూరు మండలంలోని రైతులు , భక్తాదులు, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని రైతులందరూ పాడిపంటలతో సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నారని తెలిపారు. నంద్యాల పార్లమెంట్ టిడిపి ఇన్చార్జ్ మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయ సూర్య సుఖ సంతోషాలతో ఆరోగ్యంగా ఉండేలా దీవించాలని, నందికొట్కూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేలా దీవించాలని ఆ చౌడేశ్వరి దేవి అమ్మవారిని కోరుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, శీను, రంగస్వామి, శేషయ్య, శీను, సుబ్బయ్య, వెంకటేశ్వర్లు, కుమార్, మోహన్, టిడిపి నాయకులు, కార్యకర్తలు మిడుతూరు మండల భక్తాదులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు మాదిగలకు న్యాయం

విశాలాంధ్ర-పత్తికొండ: ఎస్సీ వర్గీకరణపై రాష్ట్రాలకు అధికారం కల్పిస్తూ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీర్పునివ్వడం పట్ల ఎమ్మార్పీఎస్ నాయకులు ఎస్.తిరుపాలు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలోని రామకృష్ణ నగర్‌లో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించి డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పూలమాలలు వేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధన కోసం మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటం చేసిన ఫలితంగానే నేడు సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణపై మాదిగ, ఉప కులాలకు అనుకూలంగా తీర్పునివ్వడం శుభపరిణామం అన్నారు. ఎస్సీ వర్గీకరణ సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, వివిధ రాజకీయ పార్టీల నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రాజు, నాగరాజు, బాలు, రవికుమార్, ఉపాధ్యాయులు రమేష్, ఆర్మీ మాజీ అధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల సీఐగా రమేష్ బాబు

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : కొలిమిగుండ్ల యూపీఎస్ నూతన సీఐగా రమేష్ బాబును పోలీసు ఉన్నతాధికారులు నియమించారు. ఇటీవల పోలీస్ అధికారులు సీఐ బదిలీలను చేపట్టిన బదిలీల్లో భాగంగా ఆళ్లగడ్డ సీఐగా ఉన్న రమేష్ బాబును వీఆర్‌కు పంపి అటు తర్వాత కొలిమిగుండ్ల సీఐగా నియమించినట్లు శనివారం రాత్రి ఉత్తర్వులు వచ్చాయి. అయితే ప్రస్తుత సీఐగా కొనసాగుతున్న గోపీనాథ్ రెడ్డిని బదిలీ చేస్తున్నట్లుగాని, రిలీవ్ చేస్తున్నట్లుగాని ఎక్కడ ప్రస్తావన లేకపోవడంతో పోలీసులలో అయోమయం నెలకొంది. ప్రస్తుత సీఐ రిలీవయి, కొత్త సీఐకి ఛార్జ్ అప్పగిస్తారా, లేదా ఇద్దరి సీఐలను కొనసాగిస్తారా, అన్నది తెలియాల్సి ఉంది. బదిలీలు చేపట్టే ముందు ఆ స్థానంలో ఎవరైనా ఉన్నారా, ఖాళీగా ఉన్నదా, అక్కడ ఉన్న అధికారిని ఎక్కడికి బదిలీ చేయాలి, లేదా ఎక్కడ రిపోర్ట్ చేయాలో తదితర వాటిని క్షుణంగా ప్రభుత్వం పరిశీలిస్తుంది. కానీ ఇవేమీ లేకుండా కొత్త సీఐని నియమించడం ఉన్న సీఐ ఎక్కడికి వెళ్లాలో తెలియని అయోమయ పరిస్థితి పోలీస్ శాఖలో నెలకొంది. ఒకటి, రెండు రోజుల్లో మరోసారి బదిలీలు జరిగే అవకాశం ఉందని, ఈ బదిలీల్లో ప్రస్తుత సీఐ బదిలీ అయ్యే అవకాశం ఉన్నట్లు పోలీస్ శాఖలో చర్చ సాగుతున్నది.

కొత్తూరు సుబ్బరాయున్ని సందర్శించిన దేవాదాయ శాఖ ఉప కమిషనర్

విశాలాంధ్ర - పాణ్యం: ప్రముఖ దైవ క్షేత్రం మండల పరిధిలోని ఎస్.కొత్తూరు గ్రామంలో వెలిసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయమును దేవాదాయ శాఖ కర్నూలు ఉప కమిషనర్ గురు ప్రసాద్ ఆదివారం సందర్శించారు. ఆలయ ఈవో రామకృష్ణ ఆలయ ప్రధాన అర్చకులు వీరయ్యస్వామి, నారాయణ స్వామి, సురేష్ స్వామి, సిబ్బంది ఆలయ మర్యాదలైన పూర్ణకుంభంతో వారికి స్వాగతం పలికారు. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, నాగలింగేశ్వర స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు, విశేష పూజలు వారు నిర్వహించారు. అనంతరం శేష వస్త్రములు, శాలు వాలతో అర్చకులు వారిని సన్మానించి, స్వామివారి ప్రసాదం, ఫోటో ఫ్రేమ్‌ను అందజేశారు. ఆయన వెంట నందవరం చౌడేశ్వరి దేవ స్థానం అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరి పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజా విజ్ఞప్తుల స్వీకరణ

విశాలాంధ్ర - నంద్యాల : ఈ నెల 5వ తేదీ సోమవారం నంద్యాల పట్టణం కలెక్టరేట్ లోని సెంటినరీ హాలులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుండి అర్జీలు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ఆదివారం తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే ప్రక్రియను పబ్లిక్ గ్రీవియన్స్ రెడ్రెస్సల్ సిస్టం ద్వారా చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించే పబ్లిక్ గ్రీవియన్స్ రెడ్రెస్సల్ సిస్టం కార్యక్రమానికి ఈ నెల 5వ తేదీ సోమవారం ఉదయం 9-30 గంటలకు జిల్లాధికారులందరూ హాజరు కావాలని కలెక్టర్ తెలిపారు.

భక్తి శ్రద్ధలతో చౌడేశ్వరి దేవి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - ఉయ్యాలవాడ: మండల పరిధిలోని సుద్దమల్ల గ్రామంలో వెలసిన చౌడేశ్వరి దేవి జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పంచామృత అభిషేకాలు, కుంకుమార్చన, సామూహిక లలిత సహస్రనామం పారాయణం చేశారు. భక్తులకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

విశాలాంధ్ర - కల్లూరు: కర్నూల్ సర్వేజనా గవర్నమెంట్ హాస్పిటల్ లోని గైనిక్ వార్డ్, లాంగ్స్ వార్డ్స్ లో 500 మందికి అనారోగ్యంతో ఉన్న వారికి బ్రెడ్ ప్యాకెట్స్, ఆపిల్ పండ్లను పాణ్యం ఎమ్మెల్యే చరిత పుట్టినరోజు సందర్భంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉలిందకొండ టీడీపీ సీనియర్ నాయకులు యుద్ధం రమణ, కాసాని మహేష్ గౌడ్, టీడీపీ బిసి సెల్ స్టేట్ సెక్రటరీ, యూనిట్ ఇంచార్జి కురువ ధనుంజయ, క్లస్టర్ ఇంచార్జి వాకిటి మాదేశ్, విశ్వమ్, వెంకటేశ్వర రెడ్డి, రాజ్ కుమార్, చిన్న స్వామి, ప్రసాద్ గౌడ్ ఈవిఆర్ బృందం సభ్యులు యుద్ధం శ్రీకాంత్, షేక్షావలి, విక్రమ్, నారాయణ మహేంద్ర, సురేష్, నరేష్, రామాంజి, చంద్ర, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మినీ గోకులాలు పార్టీలకతీతంగా మంజూరు చేయాలి

విశాలాంధ్ర-తుగ్గలి: మండలంలో మంజూరైనటువంటి మినీ గోకులాలను అర్హులైన ప్రతి ఒక్కరికి పార్టీలకు అతీతంగా మంజూరు చేయాలని రాయలసీమ మాదిగ దండోరా అధికార ప్రతినిధి బందిమడుగు మల్లికార్జున అన్నారు. ఆదివారం మల్లికార్జున విశాలాంధ్ర విలేకరితో మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో మినీ గోకులాలను చాలామంది లబ్ధి దారులు నిర్మించుకొని, బిల్లులు మంజూరు కాక అవస్థ పడ్డారని, అటువంటి బిల్లు కాని లబ్ధి దారులకు బిల్లు మంజూరు చేయాలని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలను పార్టీలకతీతంగా మంజూరు చేయడం జరిగిందని, అదే తరహాలో మండలంలో అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారునికి పార్టీలకతీతంగా మంజూరు చేసి రైతులను ఆదుకోవాలని అన్నారు. ఈ మినీ గోకులాలను అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారులు అప్లై చేసుకుని గోకులాలను నిర్మించుకోవాలని తెలిపారు.

ఘనంగా కామ్రేడ్ ఈశ్వరరెడ్డి, షడ్రక్‌ల వర్ధంతి

విశాలాంధ్ర-దేవనకొండ రూరల్: పత్తికొండ మాజీ ఎమ్మెల్యే, అమరజీవి, పేదలకు భూ పంపిణీ చేసి దళితుల గిరిజనలు ఆత్మగౌరవాన్ని నింపిన మహెూన్నత నేత కమ్రేడ్ ఈశ్వర్ రెడ్డి 45 వర్ధం, సీపీఎం జిల్లా కార్యదర్శి షడ్రక్‌ల నాలుగో వర్ధంతి సందర్భంగా తెర్నేకల్‌లోని సీపీఎం కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. పార్టీ శాఖ కార్యదర్శి మహబూబ్ బాషా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అపార్టీ సీనియర్ నాయకులు బజారి, గాజుల శ్రీనివాసులు, రైతు సంఘం నాయకులు శ్రీరాములు మాట్లాడుతూ అట్టడుగు వర్గాలను వారి అభ్యున్నత కోసం అసువుల బాసిన ఎర్రగుడి ఈశ్వర్ రెడ్డి జీవితం సదా అనుసరణీయమని, షడ్రక్ జీవితం పోరాటాలకు స్ఫూర్తి అన్నారు. వారి ఆశయ సాధన కోసం మండల ప్రజానీకం ఎదుర్కొన్న సమస్యలపై నిరంతరం మార్చిస్టు పార్టీ ఉద్యమిస్తుందన్నారు. సాగునీరు, భూమి ప్రజల మౌలిక సదుపాయాలపై సీపీఎం ఉద్యమిస్తుందని పేర్కొన్నారు. పాలకుల బూటకం మాటలతో ప్రజలు సుమభ్యపెడుతున్నారని ప్రజలు మేల్కొనే సమయం దగ్గరలో ఉందని పేర్కొన్నారు ప్రజలకు రైతులకు అండగా ఉండేది ఎర్రజెండా నే అని పోరాటాలకు సమస్యల పరిష్కారం కొరకు అరుణ పతాకం మార్గదర్శి అని ఎర్రజెండా నీడలో అమరులు స్ఫూర్తితో మండలంలో ప్రజా సమస్యలపై ఉద్యమిస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేపీ రాముడు, లక్ష్మిరెడ్డి, రవి, సుధాకర్, ఏలియా, శివ, మధు, తదితర ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

స్నేహితుల రక్తదాన శిబిరం ఏర్పాటు

విశాలాంధ్ర - రుద్రవరం : స్నేహితుల దినోత్సవ సందర్భంగా పూర్వపు విద్యార్థులు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఆదివారం మండల కేంద్రం లో స్నేహితుల దినోత్సవం సందర్భంగా 1993-94 వదో వతరగతి పూర్వ విద్యార్థులు స్థానిక అమ్మవారి శాల కూడలిలో దాదాపుగా 35 మందితో రక్త దాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కోసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఫ్రెండ్షిప్ బ్యాండ్లు కట్టుకున్నారు. అనంతరం రక్త దానం చేశారు. ఈ కార్యక్రమాన్ని మిత్రబృందం సుమారుగా రెండు నెలలుగా ప్రణాళికలు చేసి నిర్వహించామని, గతంలో వచ్చిన కరోనా సమయంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించి, పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసి గ్రామస్తుల ఆశీర్వచనాలను పొందారు .తమ మిత్రులు అకాల మరణం చెందిన వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. మిత్రుల సహకారంతో ఇలాంటి మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విద్యనేర్పిన గురువు అల్లడి సుబ్బరాయుడు, మండల విద్యాశాఖాధికారి కోటయ్య, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ సుబ్బరాయుడు, ప్రాథమిక వైద్యాధికారి శివ మోహన్, ఏపీఎన్ జీవో హెల్త్ ఆఫీసర్ హుస్సేన్ రెడ్డి పాల్గొన్నారు. వీరికి 1993-94 బ్యాచ్ పూర్వ విద్యార్థులు సన్మానం చేసి సత్కరించారు.

స్నేహితుల రోజున పూర్వ విద్యార్థుల సమ్మేళనం

- కోవెలకుంట్లలో ఘనంగా ఫ్రెండ్షిప్ డే వేడుకలు

విశాలాంధ్ర- కోవెలకుంట్ల: అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం సందర్భంగా పూర్వ విద్యార్థులైన వారంతా ఒక చోటకు చేరారు. ఎప్పుడో చిన్నప్పుడు కలిసి చదువుకున్నవారు ఫ్రెండ్షిప్ డే సందర్భంగా వారంతా ఒక చోటికి చేరారు. కలిసి వేడుక చేసుకున్నారు. కోయిలకుంట్ల పట్టణంలో ఆదివారం ముక్కెర పంక్షన్ హాల్ అందుకు వేదిక ఐనది. ఆటపాటలతో ఆనాటి తీపి గుర్తులను నెమరు వేసుకున్నారు. కోయిలకుంట్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 19821984 ఇంటర్ చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఫ్రెండ్షిప్ డే సందర్భంగా కోయిలకుంట్ల పట్టణంలోని ముక్కెర పంక్షన్‌లో జరిగింది. పట్టణానికి చెందిన గుద్దేటి చంద్రశేఖర్ రెడ్డి, లహరి నాగేశ్వరరావు, పొట్టిపాడుకు చెందిన డాక్టర్ మధుసూదన్ రెడ్డి, మబ్బుల్, సుధాకర్ రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో ఆ విద్యా సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉద్యోగ, వ్యాపారాల రిత్యా ఎక్కడెక్కడో స్థిరపడిన అప్పటి విద్యార్థులంతా ఒకే చోట చేరి అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. చిన్నపిల్లలై ఆనందంతో గెంతులు వేశారు. అనంతరం ఒకరికి ఒకరు ఫ్రెండ్షిప్ డే శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. స్నేహితులలో ఎవరైనా ఇబ్బందుల్లో ఉంటే ఆదుకునేందుకు ట్రస్ట్ ను ఏర్పాటు చేసుకున్నారు. స్నేహితుల పిల్లల విద్యా, వైద్య అవసరాలకు ఒకరికి ఒకరు తోడ్పాటు అందించుకోవాలని ఈ సందర్భంగా తీర్మానించుకున్నారు. పూర్వ విద్యార్థుల కలయిక అనేది అపూర్వమైనదని పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా అందరూ కలిసి సహపంతి భోజనం చేశారు. ప్రతి ఏటా స్నేహితుల దినోత్సవం సందర్భంగా వీరు అందరు కలుసుకోవడం కొన్ని సంవత్సరాలుగా ఆనవాయితీగా వస్తుంది.

మూగబోయిన ఆర్టీసీ అనౌన్స్‌మెంట్ మైకు

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు

విశాలాంధ్ర - అవుకు: ప్రయాణికుల సౌకర్యార్థం అవుకు బస్టాండు ప్రాంతంలో ఆర్టీసీ వారు ఏర్పాటు చేసిన అనౌన్స్మెంట్ మైకు పని చేయక పోవడంతో ప్రయాణి కులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. నిత్యం వందలాది మంది ప్రయాణికులు తమ ప్రయాణాలను సాగించే వారి కోసం అవుకు బస్టాండ్ ప్రాంతంలో ఆర్టీసీ అధికారులు ఒక అనౌన్స్‌మెంట్ మైకును ఏర్పాటు చేశారు. దీని వల్ల అవుకు బస్టాండుకు రెండు కిలో మీటర్ల దూరంలో బస్సు వస్తున్నప్పుడు కండక్టర్ సిగ్నల్ ద్వారా ప్రయాణి కులకు మరి కాసేపట్లో బస్సు వస్తుందన్న సమాచారం అనౌన్స్మెంట్ రూపంలో ప్రయాణికులకు తెలిసేది. గత కొద్ది రోజుల నుండి మైకు పని చేయక పోవడంతో ప్రయా ణికులు టీ హెూటళ్లు, కూల్ డ్రింక్ షాప్ యజమానులను బస్సు రాకపోకల సమాచారం అడిగి తెలుసు కుంటూ నానా అవస్థలు పడుతున్నారు. గతంలో ఉన్న బస్సు రాకపోకలకు సంబంధించిన బోర్డు లేదని ప్రయాణికులు వాపోతున్నారు.

ట్రాఫిక్ గైడ్‌ను పునరుద్ధరించాలి : బస్సు రాకపోకల సమయాలను ప్రయాణికులకు తెలియజేసేందుకు అవుకు బస్టాండ్ లో ట్రాఫిక్ గైడ్‌ను ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ గైడ్‌గా నియమించబడిన యాడికి ప్రసాద్ తన విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రయాణికుల మన్ననలు పొందారు. జిల్లాల పునర్విభజనలో భాగంగా నంద్యాల జిల్లా నూతనంగా ఏర్పడడంతో జిల్లా ఆర్టిసి అధికారుల నుండి ట్రాఫిక్ గైడ్ యాడికి ప్రసాదుకు జీతం అందక తన సేవలను నిలిపి వేయడంతో ప్రయాణికులకు ఇక్కట్లు ప్రారంభ మయ్యాయి. ఒకవైపు మైకు పని చేయకపోవడం, మరోవైపు ట్రాఫిక్ గైడ్ లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇకనైనా ఆర్టీసీ అధికారులు స్పందించి ట్రాఫిక్ గైడును పునరుద్ధరించి, బస్సు రాకపోకల సమయాలను సూచించే బోర్డును ఏర్పాటు చేసి, అనౌన్స్మెంట్ మైకును ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోంది

- టీడీపీ నాయకులు హత్యా రాజకీయాలకు చరమగీతం పాడండి
- మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

విశాలాంధ్ర - నంద్యాల : రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తున్నదని, హత్యా రాజకీయాకు టీడీపీ నాయకులు చరమగీతం పాడాల్సిన అవసరం ఉందని, లేనిపక్షంలో తాము సైతం తిరగబడతామని, తగ్గేదిలేదని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తేల్చిచెప్పారు. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత నంద్యాల జిల్లా మహానంది మండలం సీతా రామపురం గ్రామంలో వైసీపీ నేత వసువులేటి పెద్ద సుబ్బ రాయుడు అలియాస్ పెద్దన్న అనే వృద్ధున్ని టీడీపీ నేతలు శ్రీని వాసరెడ్డి, అతని అనుచరులు 30 మంది పాల్గొని కర్రలతో, రాళ్లతో అతిదారుణంగా గ్రామంలో హత్య గావించడం జరిగింది. ఈ ఘటనకు సంబంధించి శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి, బనగాన పల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మృతదేహాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. వైసీపీ నాయకులకు, కార్యకర్తలకు తాము ఎల్లవేలలా వెన్నంటి ఉంటామని, భయపడాల్సిన అవసరం లేదని ధైర్యం కల్పించారు. ఇకనైనా రెడ్ బుక్ రాజ్యాంగానికి స్వస్తిపలకాలని, గ్రామాలలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు టీడీపీ ప్రభుత్వం చర్యలు తీసు కోవాలని వారు కోరారు. ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి, ఎమ్మెల్సీ ఇసాక్ బాష, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి, వైసీపీ నాయకులు శిల్పా భువనేశ్వరెడ్డి తదితర నాయకులు హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వంలో రెడ్ బుక్ రాజ్యాంగం, హత్యా రాజకీయాలు నడుస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసెంబ్లీ సాక్షిగా రాష్ట్రంలో దాడులు, హత్యా ఘటనలు జరగవని చెప్పడం జరిగిందని, అసత్యపు ప్రకటనలు మాత్రమేనని తెలుస్తున్నదన్నారు. ఈ ఘటనలకు కారకులు స్థానిక ఎమ్మెల్యేనా? లేక సీఎం చంద్రబాబా? లేదా నారా లోకేషా చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామంలో మరికొన్ని హత్యలు జరిగే అవకాశం ఉందని, నారపురెడ్డి, పెద్దిరెడ్డి, జమాల్రెడ్డి, ఇతర వైఎస్సార్సీపీ నాయకులకు పోలీసులు రక్షణ కల్పించాలని శిల్పా కోరారు. నంద్యాల జిల్లా వైసీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి, బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిలు మాట్లాడుతూ సీతారామపురం గ్రామంలో జరిగిన దారుణ హత్యను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. టీడీపీ హత్యా సంస్కృతికి, ప్యాక్షన్ రాజకీయాలకు చరమగీతం పాడాలని కోరారు. హత్యా రాజకీయాలకు స్వస్తి పలకాలని, హత్యచేసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.